నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 18 మే 2025 | NIZAMABAD

రైతన్నపై విత్తన పిడుగు

మూడింతలు పెరిగిన ధర..

ఆరుగాలం కష్టపడే రైతులపై కాంగ్రెస్ సర్కారు మరో పిడుగువేసింది. ఇప్పటికే సాగును భారంగా మార్చిన ప్రభుత్వం.. జీలుగ విత్తన ధరలు పెంచి వారిపై ఆర్థిక భారం మోపింది. 30 కేజీల బస్తా ధర సుమారు మూడింతలు పెరిగింది. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే భారీగా ధరలు పెంచడంపై మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాలకు రైతులను దూరం చేసింది. ఏ పథకాన్ని సంపూర్ణంగా అందరికీ అందించకపోవడంతో రైతులు సమస్యలతో సతమతమవుతున్నారు. జీలుగ విత్తనాలను పెంచిన ప్రభుత్వం శనివారం నుంచే ఉమ్మడి జిల్లాలో పంపిణీ ప్రారంభించింది. సొసైటీల ద్వారా అన్నదాతలకు సబ్సిడీపై అందజేస్తున్నారు. 30 కేజీల జీలుగ విత్తనాల ధర 4,275 రూపాయలుగా నిర్ణయించారు. 50శాతం సబ్సిడీపై రైతులకు రూ.2,137.50 రూపాయలకు అందజేస్తున్నది. రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌లను సొసైటీ కార్యాలయాల్లో చూపించి సబ్సిడీపై జీలుగ విత్తనాలను తీసుకోవాలని అధికారులు సూచించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్తాధర రూ.800

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తూ వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. వానకాలం సీజన్‌కు ముందు భూములకు ఎరువుగా ఉపయోగపడుతుందని జీలుగ విత్తనాలను అలుకుతారు. తద్వారా ఆ తర్వాత వేసే పంటకు అది మంచి ఎరువుగా ఏర్పడి దిగుబడి అధికంగా వస్తుందని అటు వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు ఇటు అన్నదాతలు కూడా విశ్వసిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా ధరను కేవలం 800 రూపాయలకు మాత్రమే అందిస్తూ వచ్చింది. అందుకు రైతన్నలు కూడా జీలుగ విత్తనాలు బస్తాలను విరివిగా కొనగోలు చేసేవారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న జీలుగ బస్తాల ధరను చూసి రైతన్నలు అవాక్కవుతున్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే మూడింతలకు పైగా ధర పెంచడంపై మండిపడుతున్నారు. ఇలా ఒక్కసారిగా మూడింతలు పెంచడం సరికాదని, వెంటనే తగ్గించి రైతులకు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ధర తగ్గించాల్సిందే..

సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ధర ఒక్కసారిగా పైగా పెరగడంతో పెదవి వివరిస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే 30 కేజీల బస్తాను పాత ధరకే అందించాలని కోరుతున్నారు. ఒకవేళ సర్కారు స్పందించకపోతే అన్నదాతల ఆగ్రహం ఏ విధంగా ఉంటుందో చూపిస్తామని తెగేసి చెబుతున్నారు. అన్నదాతను ఆదుకుంటామని గొప్పలు చెప్పే కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా జీలుగ విత్తనాల ధరను తగ్గించాలని కోరుతున్నారు.



డిచ్‌పల్లి, మే 17: రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ రైతులను అదనుచూసి దెబ్బకొడుతున్నది. ఇప్పటికే పథకాల అమలులో అనేక కొర్రీలు పెడుతున్న సర్కారు.. తాజాగా జీలుగ విత్తన ధరలు పెంచి రైతులపై మరో పిడుగు వేసింది. ఏకంగా మూడింతలు ధర పెంచేసి రైతులపై మోయలేని భారం మోపింది. రైతులు ఏటా సాగుకు ముందు భూమి సారవంతానికి, పంట దిగుబడి కోసం జీలుగ విత్తనాలను చల్లుకుంటారు. ఏపుగా పెరగగానే కలియదున్ని ఎరువుగా మార్చుకొని నేలను సాగుకు సిద్ధం చేసుకుంటారు. అయితే ఈ ఏడాది విత్తన ధరను భారీగా పెంచేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 కేజీల జీలుగ విత్తన బస్తాను కేవలం రూ.800కు మాత్రమే అందించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ధర రూ.4275లుగా నిర్ణయించి, సబ్సిడీపై రూ.2137.50లకు రైతులకు అందిస్తూ వారిపై ఆర్థిక భారం మోపుతున్నది.

రైతులపై ఇంత చిన్న చూపా?

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర కాక ముందే రైతులను చిన్నచూపు చూస్తున్నది. ఏడాదిన్నర కాలంలోనే జీలుగ విత్తన ధర మూడు రెట్లు పెంచడం చాలా అన్యాయం. ఇది సమంజసం కాదు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందించాలి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 30 కేజీల బస్తాను కేవలం రూ.800లకే అందించాం. అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నది. జీలుగ ధరలను తగ్గించకపోతే రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదు. రైతుల పక్షాన మేము పోరాటం చేస్తాం.

- బాజిరెడ్డి గోవర్ధన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే

- భారీగా పెరిగిన జీలుగ విత్తన ధరలు
- వానకాలం సీజన్‌కు ముందే పెంచిన ప్రభుత్వం
- అన్నదాతను నిండా ముంచుతున్న కాంగ్రెస్ సర్కారు
- లబోదిబోమంటున్న రైతన్నలు

ధర ఆమాంతం పెంచితే ఎలా కొనేది?

జీలుగ విత్తనాల ధరను ఇంత పెద్ద మొత్తంలో పెంచడం సరికాదు. ఇది రైతులపై ఆర్థిక భారం మోపడమే. అంతధర పెట్టి రైతులు ఎలా కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం ఆలోచించాలి. ధరను అందుబాటులోకి తీసుకురావాలి.

- నీరడి పద్మారావు, రైతు, బర్దిపూర్

ధరలు ఎందుకు పెంచారు?

విత్తన ధరను పెంచి రైతులపై మోయలేని భారం మోపింది. ఇప్పటికే ఖర్చులే తడిసిమోపెడవుతుండగా..ప్రభుత్వం జీలుగ విత్తనాల ధర పెంచి రైతులపై మరో పిడుగు వేసింది. ఇది కచ్చితంగా రైతులను మోసం చేయడమే. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

- మారంపల్లి సుధాకర్, రైతు, ఇందల్వాయి

జర్నలిస్టుల దిష్టిబొమ్మల దహనం

హేయమైన చర్య

బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, నాయకులు రజాక్, బెంజర్ గంగారాం

బోధన్, మే 17: 'నమస్తే తెలంగాణ', టీ న్యూస్‌లో వచ్చిన కథనంతో ఇసుక క్వారీలు బంద్ చేశారనే అక్కసుతో ఇసుక మాఫియా సదరు మీడియా జర్నలిస్టుల దిష్టిబొమ్మలను దహనం చేయడం, దాడులకు దిగడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్ యాదవ్ మండిపడ్డారు. శనివారం ఆయన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎం.ఏ రజాక్, మాజీ కౌన్సిలర్ బెంజర్ గంగారాం, పట్టణ నాయకుడు ప్రవీణ్, రేఖం దాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నమస్తే తెలంగాణ' విలేకరి బలరామరాజుపై ఇసుక మాఫియా ఈ విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. సీనియర్ జర్నలిస్టు బలరామరాజు, టీ న్యూస్ విలేకరి తారాచంద్‌పై జరిగిన దాడులు పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడులని పేర్కొన్నారు. ఇద్దరు జర్నలిస్టులపై జరిగిన దాడిపై స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమగ్ర విచారణ జరిపించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సాగర్, షేక్ జావీర్, అహ్మద్, షేక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా దుశ్చర్య సిగ్గుచేటు

- **బీజేపీ జిల్లా, బోధన్ నాయకులు**

మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా, పట్టణ నాయకులు

బోధన్, మే 17: నమస్తే తెలంగాణ దినపత్రిక, టీ న్యూస్ ఛానల్‌లో వచ్చిన కథనాలతో ఇసుక క్వారీలు బంద్ కావడంతో, ఇసుక అక్రమ రవాణాదారులు ఆ పత్రికల విలేకరుల దిష్టిబొమ్మలు దహనం చేయడం, వారి పట్ల అనుచితంగా వ్యవహరించడం హేయమైన చర్యని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, బోధన్ రూరల్ మండలం అధ్యక్షుడు సిర్ప సుదర్శన్ అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. 'నమస్తే తెలంగాణ' విలేకరి బలరామరాజు, టీ న్యూస్ విలేకరి తారాచంద్‌పై జరిగిన ఈ దుశ్చర్యను ప్రజలు సహించబోరన్నారు. ఇటువంటి సంఘటనలను తాము ఎన్నడూ చూడలేదన్నారు.జర్నలిస్టులు వాస్తవాలు రాయకుండా కట్టడిచేయాలన్న దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ వివిధ మండలాల అధ్యక్షులు రావుబా గంగాధర్, ధ్యాగ నరేన్, కోలా ఇంద్రకరణ్, క్యాతం యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

పశువుల అక్రమ రవాణాపై గట్టి నిఘా

- **నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**
- **బక్రీద్ నేపథ్యంలో సమన్వయ కమిటీ సమావేశం**

కంఠేశ్వర్, మే 17: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ నేపథ్యంలో కలెక్టర్ అధ్యక్షతన శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీపీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం రూపొందించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. గోవిధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉన్నదని ,తెలంగాణలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉన్నదని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అంతర్ జిల్లా చెక్ పోస్టుల ఏర్పాటు

పశువులను స్లాటర్ హౌస్‌ల్లోనే వధించాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారితో ధ్రువీకరణ పొందాలన్నారు. బక్రీద్ నేపథ్యంలో వెటర్నరీ వైద్యులు అన్నిచోట్ల అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కందకుర్తి, సాలూర, పోతంగల్, ఖండ్‌గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్ పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్‌కలెక్టర్ ఉమామహేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందించారు..

వేటు వేశారు..

- **భిక్కనూరు కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు, విండో కార్యదర్శి విధుల నుంచి తాత్కాలిక తొలగింపు**
- **అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు షోకాజ్ నోటీసు**

భిక్కనూరు, మే 17: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన రమేశ్ అనే రైతు వరి కుప్పకు నిప్పంటించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడగా నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఆగ్రహ జ్వాల' శీర్షికన శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. విచారణ చేపట్టి బాధ్యులపై వేటు వేశారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిగా ఉన్న బి. గంగారాం కేంద్రానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడంలేదని, కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను రిజిస్టర్ వరుస క్రమంలో రాయలేదని, ఏఈవో సంతకంతో ఇచ్చే టోకెన్లు రైతులకు ఇవ్వలేదని, కొనుగోలు కేంద్రం పర్యవేక్షణలో భిక్కనూరు విండో కార్యదర్శి నర్సింహులు విఫలమైనట్లు విచారణలో గుర్తించారు. వారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు డీసీవో రామ్మోహన్ తెలిపారు. కేంద్రం పర్యవేక్షణలో విఫలమైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేశ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అకాల వర్షం..

మాచారెడ్డి/ ఇందల్వాయి, మే 17 : ఉమ్మడి జిల్లాలోని మాచారెడ్డి, ఇందల్వాయి మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కల్లాల వద్ద ఉన్న ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల కష్టం పది నిమిషాల్లో నీళ్ల పాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండాలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్లు నేలకొరిగాయి.

గజ్యానాయక్ తండాలో రోడ్డుపై కూలిన చెట్టు

మాచారెడ్డిలో ధాన్యం నుంచి నీటిని తొలగిస్తున్న రైతు

ఫత్తేపూర్‌లో పేదల ఆందోళన

మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అర్హులకే ఇండ్లు కేటాయించాలని

నిరసన దీక్ష

ఆర్మూర్‌టౌన్, మే 17: అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరుతూ మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో పేదలు శనివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. వీరికి ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఇండ్లు కూలిపోయి దీనస్థితిలో ఉన్నవారి పేర్లను ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చాలని, వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. విడుదల చేసిన మొదటి జాబితాలో అర్హులకు ఇండ్లు కేటాయించలేదని తెలిపారు. మొదటి జాబితాను మరోసారి సమీక్షించి అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించాలని కోరారు.

నిరసన శిబిరంలో కూర్చున్న ఫత్తేపూర్ గ్రామస్తులు

పోచయ్య (ఫైల్)

అడవి పందుల దాడిలో రైతు మృతి

జగ్గారావు ఫారం వద్ద ఘటన

నవీపేట,మే 17: అడవి పందుల దాడిలో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జగ్గారావు ఫారం సమీపంలో బాసర రోడ్డు పై శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్సై వినయ్ శనివా రం తెలిపారు. ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన సుంకరి పోచయ్య (46) అనే రైతు శుక్రవారం నవీపేట వీక్లీ మార్కెట్‌కు మోటర్‌సైకిల్‌పై వ చ్చాడు. కూరగాయలు, ఇతర సరుకులు తీసుకొని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో జగ్గారావు ఫారం సమీపంలో బాసర రోడ్డుపై అడవి పందులు దాడి చేయగా, రైతుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. పోచయ్యకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య సుంకరి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

మోర్తాడ్, మే 17: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి శనివారం 1,447 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1060.60 అడుగుల (11.125 టీఎంసీ) నీటి నిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 302 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

JOB OPENINGS
OPEN POSITIONS
Production Chemist 20 Members
Qul: B.Sc., Exp.0 to 5 Yrs.
QA Executives 4 Members
Qul: B.Sc., Exp. 0 to 5 Yrs.
R&D Executives 4 Members
Qul: B.Sc/M.Sc., Exp. 0 to 5 Yrs.
Chemical Engineer 4 Members
Qul: B.Tech., Exp. 0 to 5 Yrs.
WALK IN 19 to 24 MAY
VIJAYA SAI LABORATORIES INDIA PVT. LTD.
Jangampally- 503102, Cell: 9948460432